పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

## గోదావరి పుష్కరాలు

తేదిః 18.07.2014

సింహ రాశి బృహస్పతిలో ప్రవేశించటంతో జూలై 14, 2015న ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలను తెలంగాణలో అంగరంగ వైభోగంగా నభూతో నభవిష్యత్ అన్న రీతిలో జరుపుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. రాష్ట్రం నూతనంగా ఏర్పాటయిన నేపథ్యంలో రాబోయే ఈ పుష్కరాలకు భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఆధ్యాత్మిక పరిమళాలు తెలంగాణ నలుదిశలా విస్తరించేలా జరుపుకోబోయే ఈ పుష్కరాలకు శృంగేరి, కంచి, ఇతర పీఠాధిపతులతో పాటు చిన జీయర్ స్వామి లాంటి ఆధ్యాత్మిక గురువులను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి అన్నారు. పుష్కరాల నిర్వహణ ఏలా వుండాలి? ఎలా జరగాలి, ఏం చేయాలి, ఎంత గొప్పగా నిర్వహించాలి అన్న అంశాలపై ముఖ్యమంత్రి జరిపిన సమీక్షా సమావేశానికి ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి, ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యదర్శి వేంకటేశ్వర్ రావులతో పాటు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, నారదాసు లక్ష్మణ్ రావులు హాజరయ్యారు.

ముఖ్యమంత్రి ఈసమావేశంలో మాట్లాడుతూ పుష్కరుడు 12 సంవత్సరాలకొకసారి నదులను ఆవహిస్తాడని, పుష్కరాల సందర్భంగా నదీ స్నానం చేస్తే పుణ్యం కలుగుతుందనే నమ్మకం వుందన్నారు. అలాంటి పుష్కరాలను తెలంగాణలో గోదావరి ప్రవహించే ప్రదేశాలలో ఘనంగా అద్భుతంగా నిర్వహించాలని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా వున్న ప్రముఖులను పిలిచి వారితో

ప్రవచనాలు ఇప్పించాలని, ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ నుంచి ఇతర ప్రదేశాల నుంచి పుష్కరాల సందర్భంగా గోదావరి స్నానాలకు వెళ్ల దలచుకున్న వారికి అన్ని రకాల రవాణా సౌకర్యం కలిగించాలన్నారు. పుష్కర స్నానాలు చేసిన వారికి భగవత్ దర్శనం చేసుకోవడానికి సమీపంలో వున్న దేవాలయాలకవసరమగు మరమ్మత్తులు కూడా చేపట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. పుష్కర స్నానాల వల్ల ఎవరెవరికి ఏలాంటి ప్రయోజనాలు చేకూరుతాయో అనే విషయంపై అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి పుష్కర స్నానాలకు రాదలచుకునే యాత్రికులకు కూడా సౌకర్యాలు కల్పించాలన్నారు. ముంబాయి, భివాండి, షోలాపూర్, సూరత్‌లాంటి ప్రదేశాలలో ఉన్న తెలంగాణ ప్రజలు కూడా పుష్కరాల్లో పాల్గొనేలా గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రచారం చేయాలన్నారు. గోదావరి నదిలో యాత్రికులు స్నానాలు చేయడానికి అనువుగా స్నాన ఘట్టాలు విస్తృత సంఖ్యలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

పుష్కర తీర్థాల సందర్భంగా అవలంభించాల్సిన పద్దతులను, అనుసరించాల్సిన విధానాలను పరిపూర్ణంగా అవగాహన చేసుకోవడానికి శృంగేరీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యుల వారి వద్దకు ప్రభుత్వ సలహాదారు రమణాచారి నేతృత్వంలో కేసిఆర్ గురువు మృత్యుంజయశర్మ, పాలకుర్తి నృసింహ్మా సిద్దాంతి, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్దాంతి, అష్టకాల రామ్మోహన్ శర్మ, ఒక బృందంగా వెళ్లిరావాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ బృందంలో బాసర, ధర్మపురి, కాళేశ్వరం, భద్రాచలం, వేములవాడ, యాదగిరి గుట్ట, జోగుళాంబ (ఆలంపూర్) దేవాలయాల అర్చక ప్రతినిధులు కూడా వుండాలని ముఖ్యమంత్రి అన్నారు.

ఉత్కృష్టంగా, వేదోక్తంగా, సాంప్రదాయబద్దంగా యజ్ఞ యాగాదుల నిర్వహణ, విశేష పూజలు, పితృ తర్పణాలు, నూతన వధూవరుల పుణ్య స్నానాలు,

ఇతర పుణ్య కార్యాలు జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి నదికి దక్షిణ గంగ అని భారత ఉప ఖండంలో పేరుందని, గంగానది కుంభమేళాను మైమరిపించే రీతిలో పుష్కరాల నిర్వహణ జరగాలని, ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలతో తెలంగాణ వ్యాప్తంగా ఓలలాడాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. భాసర, ధర్మపురి, కాళేశ్వరం, భద్రాచలం, పుణ్యక్షేత్రాల ప్రాంతాలతో పాటు గోదావరి తీరాన గల తదితర ప్రాంతాలలో కూడా పుష్కరాలు నిర్వహించాలని అన్నారు.

ఉత్తర భారత దేశంలో కూడా గోదావరి పుష్కరాల గురించి విరివిగా ప్రచారం చేయాలని, పొరుగు రాష్ట్రమైన మహరాష్ట్రలోని నాగపూర్, చాందా, వార్ధాలలో కూడా ప్రచారం జరగాలని ముఖ్యమంత్రి చెప్పారు. విశ్వవ్యాప్తంగా వున్న తెలంగాణాకు చెందిన ప్రవాస భారతీయులు ఈ సందర్భంగా రాష్ట్రానికి వచ్చి పుణ్య స్నానాలు చేయాలని ఆయన అన్నారు. గోదావరి పుష్కరాల వెబ్ సైట్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. భక్తులు సుమారు రెండు కోట్లకు పైగా వచ్చే అవకాశం వున్న పుష్కరాల నిర్వహణకు కావలసిన రక్షణ చర్యలు, ఆలయాల మరమ్మత్తులు, తదితర సౌకర్యాల ఏర్పాట్ల విషయంలో సంబంధిత శాఖలతో తాను త్వరలోనే సమావేశమై చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి తెలియజేశారు. తెలంగాణలో వున్న ప్రముఖ సిద్దాంతులతోనూ, ప్రధానాలయాల అర్చకులతోనూ, ఇతర ప్రముఖులతోను, ఉత్తర భారతదేశంలో కుంభ మేళాను నిర్వహించే ప్రధాన అర్చకులతోను తాను విడిగా సమావేశం ఏర్పరుస్తానని ముఖ్యమంత్రి అన్నారు.

భారత రాష్ట్రపతితో పాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను, గవర్నర్లను, గోదావరి పుష్కరాల సందర్భంగా ఆహ్వానిస్తానని ముఖ్యమంత్రి అన్నారు.

---

**సిపిఆర్ఒ టూ సిఎం**